కాంగ్రెస్‌కు శిక్ష తప్పదు

'ఫిరాయింపు' సీట్లలో ఉపఎన్నికలు ఖాయం

మిగతా ఎమ్మెల్యేల పదవులు కూడా పోతాయి

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ప్రజల సమస్యలు గాలికి వదిలి.. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్ పార్టీకి న్యాయస్థానంలో, ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హెచ్చరించారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల విషయంలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్టు పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపులను అరికట్టేందుకు కఠిన చట్టం తెస్తామని ఎన్నికల సందర్భంగా మాట ఇచ్చిన కాంగ్రెస్ ఆ తర్వాత ఫిరాయింపులను ప్రోత్సహించిందని, ఆ పార్టీకి హైకోర్టు తీర్పు చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలు పార్టీ మారిన నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవని అన్నారు. 'ఒక పార్టీ గుర్తు మీద గెలిచి మరొక పార్టీలోకి వెళ్లటం నమ్మి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేయటమే. అదే విషయాన్ని కోర్టులు కూడా స్పష్టంచేశాయి. పార్టీ ఫిరాయింపుల విషయంలో ఫిర్యాదు అందిన మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని గతంలోనే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అయినప్పటికీ స్పీకర్ లెక్కచేయకపోవటం దురదృష్టకరం' అని ఆయన పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరేందుకు వెళ్లినప్పుడు సుప్రీంకోర్టు తీర్పును స్పీకర్ దృష్టికి తెచ్చామని ఆయన గుర్తుచేశారు. అయినప్పటికీ స్పీకర్ పట్టించుకోకపోవడంతో న్యాయస్థానాలను ఆశ్రయించామని తెలిపారు. న్యాయస్థానంలో న్యాయం జరుగుతుందని నమ్మామని తెలిపారు. తాజాగా హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ఇక తెలంగాణలో ఉప ఎన్నికలు ఖాయమని తేలిపోయిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ బీఫాంతో పోటీశారని, ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న లెక్కలేనితనానికి ఇది నిదర్శనమని విమర్శించారు. ఫిరాయింపులకు పాల్పడిన మిగతా ఎమ్మెల్యేల పదవులు కూడా పోవటం ఖాయమని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టి చంపాలని గతంలో రేవంత్‌రెడ్డి పేర్కొన్న మాటలను ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టాలా? లేదంటే వాళ్లను బెదిరించి, ప్రలోభాలకు గురిచేసిన ముఖ్యమంత్రిని కొట్టాలో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇదేం ద్వంద్వనీతి?

రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ అని పెద్దపెద్ద మాటలు చెప్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్‌గాంధీకి పార్టీ ఫిరాయింపుల విషయంలో చిత్తశుద్ధి ఉంటే వెంటనే రేవంత్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ మారిన చట్ట సభ్యుల సభ్యత్వం ఆటోమేటిక్‌గా రద్దయ్యేలా చట్టం తెస్తామని హామీ ఇచ్చి తెలంగాణలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తారా అంటూ నిలదీశారు. హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ నుంచి పార్టీ మారిన ఎమ్మెల్యేలకు పింఛన్ రాకుండా చట్టం చేయటం, కర్ణాటకలో తమ పార్టీ ఎమ్మెల్యేలను వందకోట్ల రూపాయలు ఇచ్చి బీజేపీ ఎత్తుకెళ్తున్నదని నానా యాగీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ దొంగే దొంగ...దొంగ అని అరుస్తూ ద్వంద్వ నీతికి పాల్పడుతున్నదని దుయ్యబట్టారు.



కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు. వారు వరుసగా దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి, సంజయ్, అరికెపూడి గాంధీ, కృష్ణమోహన్‌రెడ్డి

మీరు తేలుస్తరా.. మేం తేల్చాలా?

మొదటిపేజీ తరువాయి...

చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం 51 పేజీల కీలక తీర్పును వెలువరించారు.

తక్షణమే స్పీకర్ ముందుంచాలి

బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల మీద దాఖలైన పిటిషన్లపై నాలుగు వారాల్లో విచారణ షెడ్యూలును రూపొందించేందుకు వీలుగా ఆ ఫైళ్లను తక్షణమే స్పీకర్ ముందుంచేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించింది. 'అనర్హత పిటిషన్లపై వాదప్రతివాదులకు అవకాశం ఇవ్వాలి. వాళ్లు సమర్పించే డాక్యుమెంట్ల సమర్పణ, ప్లీడింగ్, వాదనలు తదితరాలకు షెడ్యూలు నిర్ణయించాలి. ఈ మేరకు తామిచ్చిన ఉత్తర్వుల అమలుపై హైకోర్టు రిజిస్ట్రీ (జ్యూడీషియల్)కి స్టేటస్ రిపోర్టు సమర్పించాలి. ఒకవేళ అలా చేయని పక్షంలో సుమోటోగా తిరిగి పిటిషన్లను విచారణ చేసి తగిన ఉత్తర్వులు ఇస్తాం'అని తేల్చిచెప్పింది.

హైకోర్టు అధికార పరిధి చాలా విస్తృతం

అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణీత గడువులోపు నిర్ణయం తీసుకోవాల్సిందేనని కీశం మేఘాచంద్ర సింగ్ వర్సెస్ మణిపూర్ శాసనసభ స్పీకర్ మధ్య జరిగిన కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును హైకోర్టు ప్రధానంగా ప్రస్తావించింది. 'రాజ్యాంగంలోని 226వ అధికరణం ప్రకారం పిటిషన్ విచారణపై హైకోర్టు అధికార పరిధి చాలా విస్తృతం. వీటిపై సాంకేతిక కారణాలతో నిర్ణయం తీసుకుంటే న్యాయం చేకూరదు. రాజ్యాంగ స్ఫూర్తి, ప్రజాస్వామ్యం, తత్వశాస్త్రానికి రాజ్యాంగ వ్యవస్థలు కట్టుబడి ఉండాలి. న్యాయ సమీక్ష ఒక్కటే కాదు. ప్రధాన సమస్యకు పరిష్కారం తేల్చాలి. కిహోటో హోలోహన్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ప్రకారం రాజ్యాంగ, ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమే అవుతుంది. అనర్హత పిటిషన్లలో నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్ నిరాకరిస్తే పిటిషనర్‌కు ఎటువంటి పరిష్కారం లభించదు. కీశం మేఘాచంద్రసింగ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పిటిషనర్లు తగిన ఉత్తర్వులు పొందేందుకు అర్హులు' అని పేర్కొంది.

కోర్టులు చేతులు కట్టుకొని కూర్చోవు

'అనర్హత పిటిషన్లపై స్పీకర్ స్పందించనప్పుడు నిర్ణయం తీసుకోవాల్సిందిగా స్పీకర్‌కు ఉత్తర్వులు జారీ చేయవచ్చునా లేదా అన్నదే మా తీర్పు ప్రధాన అంశం. పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవడం అన్న అంశం న్యాయసమీక్షకు లోబడి ఉంటుంది. నిర్ణీత సమయంలోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలన్న పిటిషనర్ల వాదన సరికాదనలేం. ఎందుకంటే స్పీకర్ నిష్క్రియాపరత్వాన్ని, నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేయడాన్ని ఎంతకాలం ఉపేక్షించాలన్న ప్రశ్న తలెత్తుతున్నది' అని హైకోర్టు పేర్కొంది. 'సాంకేతిక కారణాలని చెప్పి పిటిషన్‌ను కొట్టివేయడం వల్ల న్యాయం చేసినట్టు కానేకాదు. ప్రతి రాజ్యాంగ వ్యవస్థ ప్రజాస్వామ్యం, రాజ్యాంగ ప్రమాణాలు, నైతికతలకు కట్టుబడి ఉండాల్సిందే.. కాలయాపన వల్ల న్యాయం దక్కని పరిస్థితులు ఉండకూడదు. నిష్క్రియాపరత్వంపై న్యాయసమీక్షకు ఎంతకాలం వేచి ఉండాలన్నది కూడా ప్రశ్నే. చట్టసభ గడువు ఐదేండ్లు. సభ గడువు ముగిసేదాకా స్పీకర్ మౌనంగా ఉంటే కోర్టులు చేతులు కట్టుకొని కూర్చోవు. అదే జరిగితే రాజ్యాంగ నిబంధనలకు, ప్రజాస్వామ్య సూత్రాలకు అర్థం లేనట్లే అవుతుంది' అని హైకోర్టు వ్యాఖ్యానించింది.

సుప్రీంకోర్టు తీర్పు చట్టబద్ధం

'అన్ని కేసుల్లోనూ భిన్నమైన వాదనలు ఉంటాయి. వాటిని వదిలేయడానికి వీల్లేదు.. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో బాధితుల పక్షం నుంచి పరిశీలిస్తూ విషయం తీవ్రతను అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేయాలి. ఆ విధంగా ఈ కేసులో చేశాం. కిహోటో హోలోహాన్స్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు మేరకు న్యాయపరమైన క్రమశిక్షణను అనుసరించాలి.. కీశం మేఘాచంద్రసింగ్ కేసులో నిర్దిష్ట గడువులోగా అనర్హత పిటిషన్లపై తేల్చాలంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుతో విభేదించబోము. 141వ అధికరణ ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు చట్టమే, దానికి కట్టుబడి ఉండాల్సిందే' అని ధర్మాసనం స్పష్టంచేసింది.

ఇరుపక్షాల ప్రధాన వాదనలు

స్పీకర్ ఎంతకాలం నిర్ణయం తీసుకోకుండా ఉంటారనే హైకోర్టు ప్రశ్నకు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి సమాధానమిస్తూ.. ఊహాజనిత ప్రశ్నలకు జవాబు కష్టమని చెప్పారు. ఆ విషయాల్లోకి కోర్టులు వెళ్లరాదని కూడా అన్నారు. స్పీకర్ నిర్దిష్ట గడువులోగా పరిష్కరిస్తారని, లేనిపోని భయంతో పిటిషనర్లు స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన పది రోజుల్లోనే కోర్టుకు వచ్చారని కూడా తెలిపారు. పిటిషనర్ల తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ.. దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ పార్టీ తరపున సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేశారని చెప్పారు. రెండో వంతు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తారని అధికార పార్టీ పెద్దలు చెప్తున్నందున ఈ వ్యవహారంపై వేగంగా చర్యలు తీసుకోకపోతే ఫిరాయింపులకు గేట్లు బార్లా తీసినట్టు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక పార్టీ నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధి మరో పార్టీ తరపున పార్లమెంట్ స్థానానికి పోటీచేసిన పరిస్థితి ఎక్కడా లేదని చెప్పారు. దానం నాగేందర్ ఒక్కరోజు కూడా ప్రజాప్రతినిధిగా కొనసాగడానికి వీల్లేదన్నారు. అలా జరిగితే ప్రజాస్వామ్యానికే మాయని మచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు జోక్యం చేసుకోని పక్షంలో తప్పుడు సంకేతాలు వెళతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంపైన, ప్రజాస్వామ్యంపైన విశ్వాసం దెబ్బతింటుందని అన్నారు. పిటిషనర్ల తరపున తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్యామ సుందరం, సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, జే రామచందర్‌రావు వాదించారు.

పిటిషన్లలో ఏముందంటే..?

ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు 2023 నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున గెలుపొందారు. కొద్ది రోజులకే అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్‌లోకి ఫిరాయించడం చట్ట వ్యతిరేకం. వాళ్లను అనర్హులుగా ప్రకటించాలి. స్పీకర్‌ను కలిసి ఫిర్యాదు/పిటిషన్ దాఖలు చేసేందుకు ప్రయత్నిస్తే అవకాశం ఇవ్వలేదు. స్పీకర్ కార్యాలయం కూడా తమ పిటిషన్లు తీసుకోలేదు. పార్టీ ఫిరాయింపుల పిటిషన్లపై మూడు నెలల్లోగా స్పీకర్ తుది నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఆ తీర్పు ప్రకారం స్పీకర్ చర్యలు తీసుకునేలా శాసనసభ కార్యదర్శికి, స్పీకర్ కార్యాలయానికి ఉత్తర్వులు ఇవ్వాలి.. అని పిటిషనర్లు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానంద దాఖలు చేసిన పిటిషన్లలో పేర్కొన్నారు. ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ తరపున విజయం సాధించిన దానం నాగేందర్.. ఎమ్మెల్యే సభ్యత్వానికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్‌లో చేరడమే కాకుండా సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం ఫిరాయింపు చర్యల్లో పరాకాష్ఠ, నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలి.. అని బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై హైకోర్టు గత నెల 10 వాదనలు పూర్తి చేసి తీర్పును వాయిదా వేసింది. ఇప్పుడు కీలక తీర్పును వెలువరించింది.

పిటిషనర్ల వాదనలు..

'పదో షెడ్యూల్‌ను ఉల్లంఘించిన వ్యక్తులను అనర్హులుగా ప్రకటించాలనే రాజ్యాంగ లక్ష్యానికి కట్టుబడి ఉండాలంటే, ఫిర్యాదు చేసిన తేదీ నుంచి మూడు నెలల వ్యవధిలో స్పీకర్ ముందు దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై తుది నిర్ణయాన్ని వెలువరించాలి. లోక్‌సభ, అసెంబ్లీల కాల పరిమితి ఐదేండ్లు మాత్రమే. కాలపరిమితి అయ్యే వరకు పార్టీ ఫిరాయింపుల పిటిషన్లపై నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో ఉంచడం రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చడమే. కాలయాపన చేయకుండా తగిన సమయంలో తుది నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు గతంలో తీర్పు వెలువరించింది. మెజారిటీ ఉన్న పార్టీ తరపు వ్యక్తి స్పీకర్ అవుతారు. అధికార పార్టీకి వ్యతిరేకంగా స్పీకర్ నిర్ణయం తీసుకోకుండా పదవీ కాలం ముగిసే ఐదేండ్ల వరకు పెండింగ్‌లో ఉంచడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. కీశం మేఘాచంద్రసిం వర్సెస్ స్పీకర్ ఆఫ్ మణిపూర్ కేసులో స్పీకర్ రాజకీయ విధేయత కారణంగా పక్షపాత వైఖరిని సుప్రీంకోర్టు ఎత్తిచూపింది. ఆ విధంగా చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పు అని ఆందోళన వ్యక్తంచేసింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని ఒక పార్టీ నుంచి ఎన్నికవుతున్న స్పీకర్ వద్ద ఉంచాలా.. వద్దా.. అనేది పార్లమెంట్ పునరాలోచన చేయాల్సిన అవసరం కూడా ఉంది. ఈ మేరకు సుప్రీంకోర్టు సూచన చేసింది. అసెంబ్లీ కార్యదర్శి కూడా పబ్లిక్ సర్వెంటే. స్పీకర్‌పై అందరికీ గౌరవం ఉంది. కానీ, రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే ఆయన నిర్ణయం తీసుకోవడం లేదని భావిస్తున్నాం. రాజ్యాంగబద్ధ పదవిలో కూర్చొని రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడం సబబు కాదు. జిల్లా కోర్టులకు కూడా విచారణ ఇన్ని రోజుల్లో పూర్తిచేయాలని గడువు పెడుతున్నారు. స్పీకర్ సభాపతి హోదాలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై నిర్ణయం తీసుకోరు. ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో స్పీకర్ తీర్పు చెప్తారు. కాబట్టి స్పీకర్ హోదాలోని వ్యవహారంగా పరిగణించడకుండా ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో స్పీకర్ కార్యదర్శికి ఉత్తర్వులు ఇవ్వాలి. ఇలా చేసే అధికారం రాజ్యాంగ ధర్మాసనాలైన సుప్రీంకోర్టు/హైకోర్టులకు ఉంది. ఉంటుంది' అని పిటిషనర్ల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్యామ సుందరం, సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, జే రామచందర్‌రావు వాదించారు.

అడ్వకేట్ జనరల్ వాదనలు

సుప్రీంకోర్టు వేర్వేరు తీర్పుల ప్రకారం స్పీకర్‌కు కోర్టులు ఉత్తర్వులు జారీ అధికారం లేదని అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదించారు. స్పీకర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన పది రోజులకే హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారని తెలిపారు. స్పీకర్‌కు కనీస గడువు కూడా ఇవ్వకుండానే న్యాయ సమీక్ష కోరడం చెల్లదన్నారు. తన వద్దకు వచ్చిన ఫిర్యాదులపై నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను రాజ్యాంగం స్పీకర్‌కు ఇచ్చిందని తెలిపారు. రిట్ పిటిషన్లు దాఖలు చేయడంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలది తొందరపాటు చర్యగా పేర్కొన్నారు టీఆర్ఎస్ హయాంలో వేసిన అనేక అనర్హత పిటిషన్లను అప్పటి స్పీకర్ పరిష్కరించలేదని గుర్తుచేశారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు కేసులో పిటిషన్ చెల్లదని ఇదే కోర్టు గతంలో చెప్పిందని తెలిపారు. బీఆర్ఎస్ పిటిషన్లను కొట్టేయాలని కోరారు. ఇదే తరహా వాదనలను దానం, కడియం తరపున సీనియర్ న్యాయవాదులు శ్రీరఘురాం, మయూర్‌రెడ్డి కూడా వినిపించారు.

నల్లగొండలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య

త్వరలో ఉప ఎన్నికలు!

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం
- హైడ్రా పేరుతో సీఎం ఆగడాలు : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్టు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తెలిపారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు కావడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. త్వరలోనే ఉప ఎన్నికలు జరుగుతాయని జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నకిరేకల్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి సోమవారం కాళోజీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను హైకోర్టు ఆదేశించడం శుభపరిణామమని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ తీర్పు న్యాయస్థానాలపై విశ్వాసాన్ని మరింత పెంచిందని చెప్పారు. త్వరలోనే ఉప ఎన్నికలు వస్తాయని, తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. హైడ్రా పేరుతో సీఎం ఆగడాలకు పాల్పడుతున్నారని, హైదరాబాద్‌లో ఇండ్లు కొనాలన్నా.. కట్టాలన్నా ప్రజలు భయపడేలా సీఎం వ్యవహారశైలి ఉందని జగదీశ్‌రెడ్డి విమర్శించారు.

హైకోర్టు తీర్పును స్పీకర్ గౌరవించాలి

- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలి
- రాష్ట్రానికో నీతి అన్నట్టు కాంగ్రెస్ వ్యవహరిస్తున్నది
- తీర్పుపై రాహుల్, ఖర్గే స్పందించాలి
- బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, వివేకానంద డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును స్పీకర్ గౌరవించి వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లో చర్యలు చేపట్టాలని హైకోర్టు స్పీకర్‌కు సూచించిందని చెప్పారు. ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికో నీతి అన్నట్టుగా వ్యవహరించవద్దని అన్నారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హిమాచల్‌ప్రదేశ్‌లో బీజేపీకి మద్దతు పలికిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేశారని గుర్తుచేశారు. వారిని పెన్షన్‌కు కూడా అనర్హులుగా చేశారని చెప్పారు. కర్ణాటకలో ఎమ్మెల్యేలను కాపాడుకొనేందుకు కాంగ్రెస్ నానా పాట్లు పడుతున్నదని అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీలా కాకుండా ఉప ప్రాంతీయ పార్టీలా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగాన్ని పట్టుకుని తిరుగుతున్న రాహుల్‌గాంధీ తెలంగాణ ఫిరాయింపులపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. రేవంత్‌రెడ్డికి క్యారెక్టర్ లేదని, రాహుల్‌గాంధీ అయినా తాను ఫిరాయింపులపై చెప్పిన మాటలకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఫిరాయింపుల చట్టాన్ని పటిష్ఠం చేస్తామని చెప్పారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఫిరాయించిన పది నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు రావడం ఖాయమని అన్నారు. దానం నాగేందర్‌ను హైదరాబాద్ రోడ్లపై తామే ఉరికిస్తామని, రేవంత్‌రెడ్డి అవినీతి సొమ్ముతో పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తలా వంద కోట్లు ఇచ్చి కొన్నాడని ఆరోపించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ హైకోర్టు తీర్పు బీఆర్ఎస్ సాధించిన తొలి విజయమని అన్నారు. మళ్లీ కోర్టు జోక్యం చేసుకోకముందే పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటువేయాలని కోరారు. స్పీకర్ స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలని, సీఎం ఆయనపై ఏ ఒత్తిడీ తేవొద్దని అన్నారు. స్పీకర్ అసెంబ్లీ గౌరవాన్ని కాపాడాలని, కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని పరిరక్షించాలని సూచించారు. హైకోర్టు తీర్పు చరిత్రాత్మకమైందని, ప్రజాస్వామ్యవాదులందరూ దీనిని స్వాగతించాలని కోరారు. హైకోర్టు తీర్పుపై రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే స్పందించాలని అన్నారు.

హైకోర్టు తీర్పును స్పీకర్ అమలు చేయాలి

వినోద్‌కుమార్

హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

హనుమకొండ, సెప్టెంబర్ 9: బీఆర్ఎస్ బీ ఫామ్‌పై గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్పీకర్ విచారణ చేసి త్వరగా అమలు చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగిందని, సుదీర్ఘ చర్చల అనంతరం కోర్టు నాలుగు వారాల లోపు ఈ పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించిందని తెలిపారు. స్పీకర్ గడ్డం వెంటనే స్పందించి 4 వారాల్లోపు చర్యలు తీసుకోవాలని, లేకుంటే హైకోర్టు మళ్లీ జోక్యం చేసుకోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు.

లోకం పోకడ



ఈ వరదల్లో మమ్మల్ని నిమజ్జనం కాకుండా చూడు స్వామీ.. మీ నిమజ్జనం ఘనంగా జరిపిస్తాం!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	32.9°c	23.8°c
ఖమ్మం	31.0°c	24.0°c
మెదక్	30.8°c	22.6°c
నిజామాబాద్	30.2°c	24.5°c
రంగారెడ్డి	29.6°c	21.9°c
నల్లగొండ	28.5°c	22.0°c
మహబూబ్‌నగర్	28.2°c	22.5°c
కరీంనగర్	28.0°c	26.0°c
వరంగల్	27.0°c	24.0°c
హైదరాబాద్	26.8°c	23.6°c

హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుకు అనుగుణంగా స్పీకర్ నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడుతారని ఆశిస్తున్నామని తెలిపారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టులాంటిదన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు ఖాయమని హైకోర్టు తీర్పుతో తేలిపోయిందని అభిప్రాయపడ్డారు.

ఇకనైనా నిర్ణయం తీసుకోవాలి: వేముల

ఫిరాయింపుదారుల అనర్హత విషయంలో స్పీకర్ తన నిర్ణయాన్ని ఇక జాప్యం చేయలేరని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మణిపూర్, మహారాష్ట్రలో కాంగ్రెస్ నుంచి పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై అక్కడి స్పీకర్ కార్యాలయం జాప్యం లేకుండా నిర్ణయం తీసుకుందని అన్నారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో స్పీకర్ నాలుగు వారాల్